

# కల - నిజం

రచన: దాసరి సుబ్రహ్మణ్యం

జనాన్ని తప్పుకుంటూ, తోలగనెట్టుకుంటూ గౌరిగాడు గేటుదాటి బయటికి వచ్చాడు. పిండారబోసినట్టుగా తెల్లని వెలుగును వెదజల్లే ఎలక్ట్రిక్ లైట్ల వెనకా, సోలంపుగా రోడ్డుమీద... అంతా గౌరిగాడికి అదో తెలియని తీయని కొత్త ప్రపంచంలోకి జొరబడుతున్నట్టుగా తోచింది.

సినీమాలో కథానాయకుడూ, కథానాయకీ పాడిన ఆ పాటల్లోని ఏ ఒక్క చరణమూ సొంతంగా గొంతుకు పట్టక పోయినా, మొత్తం కథలోని ప్రేమ— శృంగార రసాలూ, ఆ ఘట్టాలూ నిండుగా అతడి వంటికి తైలమర్ధనంలా పట్టుకుని యింకిపోయినై.

సినీమా కథానాయకుడిలాగే గౌరిగాడికీ ఏదో తెలియని బాధా, మదిలో కళ్లు తెరుస్తూన్న కలవరం, గురివింద తీగల్లా అన్నివైపులనుంచీ గుబురుకున్నయ్.

రోడ్డుకు ఓ పక్కగా కాళ్లీడ్చుకుంటూ నడిచే గౌరిగాడు మనస్సును ఊహా ప్రపంచంలోకి పరిగెత్తించాడు.

కథానాయకి సుగంధిని నిజంగా రాజు కూతురులాగే అందమైంది. తను కట్టుకోబోతున్న పుల్లాం; ఆమాటకొస్తే ఫాదిరీ కూతురు ఎంజలమ్మకూడా ఆ అందం

ముందు పొగచూరిన కట్టెపేడుల్లా కన బడుతారు. అయినా అంత అందంగల రాజుకూతురూ తండ్రిదగ్గిర బంట్రోతుగిరి చేసేవాడి కొడుకును ప్రేమించడం......

అతడు నిలబడ్డాడు. రోడ్డు పక్కన చింతచెట్టు కింద వదిలి వచ్చిన బండి వంక చూశాడు. గుండెలు గతుక్కుమన్నయ్. మోకాళ్ళల్లో పట్టు సడలినట్లయింది. చింతచెట్టు గుబురు కొమ్మల కింది పల్చని చీకటిలో తన యజమాని ఎడ్లను అదిలిస్తున్నాడు.

గౌరిగాడు గబగబ నడిచాడు. సినీమా లోని రాజుకూతురు అతని మనోకాశం లోని మబ్బుల చాటున మాయమైంది.

"ఏంరా! వొళ్ళు బలిసిందా! ఇప్పుడు దాకా ఏం చేస్తున్నావ్?" గౌరిగాడు గజగజ లాడాడు. యజమాని సీతయ్య చేతిలో చర్నాకోలుకోసం,కళ్ళు కుంచించి చూశాడు.

"వెధవాయికి సినిమా చూసి మతి చెడింది కామాలు!"

శాంత నవ్వుతూనే అని– మళ్ళీ ఫక్కున నవ్వింది. తల్లి సూరమ్మ కూడా వంత నవ్వింది. ఒక్క సీతయ్యమాత్రం నవ్వకుండా గట్టిగా గదమాయించాడు.

"బండి కట్టు! ఊఁ! తొందరగా."

గౌరిగాడు తలవంచుకునే ఎడ్లను కాడి కిందకు లాగాడు. అవి రాక మొరా యించినై.

"ఓరి గాడిదా! ఎలపటా దాపటా కూడా మరచిపోయావ్!" సీతయ్య పళ్లు కొరికాడు. శాంత మళ్ళీ ఫక్కున నవ్వింది. తల్లి సూరమ్మ మాత్రం చూస్తూ వూరుకున్నది.

గౌరిగాడు తొట్లో కూర్చుని బండి తోలుతున్నాడు. శాంతా, సూరమ్మా సీతయ్యా వెనక జల్లలో సవారికింద కూర్చుని మాట్లాడు కొంటున్నారు. శాంత మధ్య మధ్య నవ్వుతూనే వుంది.

ఎడ్లు అదిలించకుండానే వేగంగా నడు స్తున్నయ్. గౌరిగాడికి, శాంత మధ్య మధ్య నవ్వినప్పుడల్లా శరీరం కుదిలించి నట్టవుతోంది. ఆ నవ్వు అచ్చగా సినీమాలో రాజుకూతురు నవ్వులానే వుంది.

చవితినాటి చంద్రుడు ఆకాశంలో మేఘాలమీదగా–కిందగా పరవళ్ళు తీస్తు న్నాడు. ఎలక్ట్రిక్ దీపాలూ, రణ గొడధ్వనులూ లేని పల్లెటూరి రోడ్డు మీదుగా బండి కుదుల్తూ కదులుతోంది. రోడ్డుకు యిరువైపులావున్న తుమ్మచెట్ల మీంచి విరగపూసిన తుమ్మ పువ్వుల మదపువాసన గౌరిగాడి నాశికారంధ్రా లని తాకి శరీరాన్ని వుడుకెత్తిస్తోంది. నూగు మీసాలమీద అరి చేతిని రుద్దుకుని ఎడ్లను గట్టిగా అదిలించి తిరిగి వూహా లోకాల్లోకి ఎగబాకాడు.

ఆ మరనాటిరాత్రి సగం నూర్చిన కుప్ప పక్కన, తడిపొడిగా వున్న నూర్పిడి గడ్డిలో వెల్లకిలా పడుకుని గౌరి గాడు ఆకాశంలోకి చూస్తూ, తిరిగి సినీమా చూడసాగాడు.

ఒకొ్కక్క దృశ్యమే అతడికళ్ళ ముందు, పంచమినాటి చంద్రుడి కాంతిలో కదిలింది...

"ప్రేమకి బీదా — పేదా తేడా లేదు."

"మానాయన దగ్గిర నౌకరీ చేసే వాడి కొడుకువైతే మాత్రమేం! నీ సాహసం... ధైర్యం..." రాజు కూతురు పక్కకు తలతిప్పి గుబురుగా వున్న తెల్లని పువ్వుల చాటున ఫక్కున నవ్వింది.

గౌరిగాడు అదిరిపడిలేచాడు. అతడి నరనరాలూ సాగనారతాడులాకరుకెక్కినై. నూనూగు మీసాలు నాగు జెముడు ముళ్లలానిటారుగా నిలబడి పదునెక్కినై.

"ఆనవ్వు! ఆనవ్వు!"

గౌరిగాడు అరిచాడు. వెలుగును చూచిన ఖైదీలా, పరమ సత్యాన్ని కనుగొన్న తపస్విలా ఆనందంతో గొంతెత్తి పాడాడు, ఆపాటకు ఎండిన వరిదుబ్బుల్లోనుంచి నాముపిలకలుపుట్టి బయటికి తొంగి చూసినై. చేలగట్లూ, నెర్రుల్లో దాక్కున్న బుర్రి పిట్టలూ, కలుగుల్లోని తాచు పాములూ, పెరిగి, రెక్కలు విదిలించుకుని, మెలికలు తిరిగినై.

గౌరిగాడు, ఆకాశంలోని చంద్రుడు వంక చూస్తూ, వూరి వైపుకు గొంతెత్తి పాడాడు. ఆపాట సీతయ్య నడవాయింటి సీనారేకు గొట్టాలగుండా కాంత గదిలోకి ప్రవేశించి ఆమెని వుక్కిరిబిక్కిరి చేసి ఫక్కున నవ్విస్తుందని అతడి ఆశ.

తెల్లవారింది. నూర్పిడి జోరుగా సాగుతోంది. గౌరిగాడు బంతి తిప్పుతున్నాడు. ఎడ్లూ, ఆవులతోపాటు, అతడూ శరీరాన్ని గానుగ ఎద్దులా గిర్రున కుప్పగడ్డిలో తిప్పుతున్నాడు. మనస్సు మాత్రం తన యజమాని కూతురు కాంత వోణీలోని అన్ని మడతల్లో, పొరల్లో గిర్రున తిరుగుతూ కితకితలు పెడుతోంది.

"యీ గాడిదకి మతిపోయింది!"

సీతయ్య పెద్దగా అరుస్తున్నాడు. గౌరిగాడు వులిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు. బంతి గొడ్లన్నీ ఓచుట్టు తిరిగి అతడి వీపు వెనకకు వచ్చి ఆగివున్నయ్.

తిరిగి శరీరాన్ని పనికి వప్పచెప్పి, మనస్సుని వూహా వాయువుల మీదగా వూళ్ళోకి నిడిపి, సుడిగాలిలా కాంతను చుట్టుముట్టాడు.

సూర్యుడు తలమధ్య కెక్కాడు. పని వాళ్ళంతా ఎవరి అన్నం మూటలు వాళ్లు విప్పుకుని భోజనాలకు తలపడ్డారు, సీతయ్య రుసరుసలాడుతూ అన్నాడు.

"గౌరిగా! తొందరగా కూడుతిని రావాలి. యీ పనైన తరువాత నీమత్తుకు మందేస్తాను"

గౌరిగాడు తలవంచుకుని వూళ్ళోకి బయలుదేరాడు. అతణ్ణి ఒకేఒక సంశయం నరాల్లో కెక్కిన యీతముల్లులా బాధిస్తోంది. "పెళ్ళి విషయం సీతయ్యని అడగడమా? కాంతను అడగడమా?"

ఆ కాల్చే ఎండలో చేల గట్లంట నడుస్తూ, మగత నిద్దరలో వున్నవాడిలా, మధ్య మధ్య భూతావేశం కలిగిన

వాడిలా అటూ యిటూ గట్లమీద జారుతూ, సినిమా కథానాయకుడి మాటల్నీ, చేష్టల్నీ మననంచేయసాగాడు.

"సాహసే లక్ష్మి" అవును! దేనికైనా సాహసించాలి! సినిమా కథానాయకుడుచేత్తో తాచుపామునుపట్టాడు. తను కిర్రుచెప్పుల కాలితో దాని పడగను తొక్కిపట్టి చంపాడు. రాజుకూతురుకీ, ఆ కథానాయకుడికీవున్న స్నేహానికన్నా తన స్నేహం శాంతతో మరీ చిన్నప్పటి నుంచి ప్రారంభమైంది. తను వూహ తెలిసినప్పటినుంచీ సీతయ్య ఇంట్లో జీతం చేస్తున్నాడు.

ముళ్ళ నేభయం ఏమీ లేకుండా తను ఎన్నిసార్లు ఆ చిన్నతనంలో శాంతకు రేగికాయలు కోసిపెట్టలేదు! ముంజకాయలు కావాలంటే—కాళ్లకు బంధమైనా లేకండా ఎన్నిమార్లు తను అంతంత తాడిచెట్లు ఎక్కలేదు!!

తనపెళ్ళి పుల్లాంతో జరగటం అసంభవం. చింపిరిపేలికలతో, మడ్డిమొహంతో, జీబిరిజుట్టుతో; పేడతట్ట నెత్తినపెట్టుకొని వస్తుంటే—ఆ రోజుల్లో ఎలావున్నా ఇప్పుడు తలుచుకుంటేనే మేపాళంమాత్ర వేసుకున్నట్టుగా అవుతోంది.

సీతయ్య ఆ రాజులాగానే డబ్బు సంపాయించమంటాడా? గౌరిగాడి ముందు హఠాత్తుగా ఈ ప్రశ్న తాచుపాములా ఎగిరి నిలబడింది.

విష్ణాలయంపక్క పాడుపడిన భావిలో లంకెణీ బిందెలు వున్నమాట నిజమేగదా! దానయ్యా, చలమయ్యా వాటికోసం ప్రయత్నించి నెత్తురుకక్కి చచ్చారు. కాని... తను... సాహసించి... శాంతకోసం తెగించి వాటిని బయటకు తేలేడా?

గౌరిగాడి గుండెల్లో భయం ఎద్దుకొమ్ములా మొన తేలింది.

తను విన్నదయ్యాల కథలూ, ఫాదిరీ చెప్పే సైతాన్ చరిత్రా—అంతా అతడి కాళ్లనీ, హృదయాన్నీ జెర్రిపోతులా మెలివేసుకుని ఛెళ్ళు ఛెళ్ళుమని తోకతో చరుస్తోంది.

సినీమాకథ మళ్ళీ అతడి కళ్ళముందు—పక్కల్లా కదుల్లాడింది... సాహసం చేయాలి... ప్రేమకోసం...

తలవంచుకునే వూళ్ళోకి ప్రవేశించాడు. నడుం వంచుకుని చావిట్లోకి జొరబడ్డాడు. నల్లగా మాడుకట్టిన మల్లని ఏవగింపుగా చేతిలోకి తీసుకుని పెద్దగా అరిచాడు—

"శాంతమ్మా! శాంతమ్మా!"

"ఏంరా! మతిబోయిందా! అరుస్తావెందుకు?" సూరమ్మ కూక లేస్తూ బయటకు వచ్చింది.

"తొందరగా ఎళ్ళాలి! బువ్వ..."

"ఫోవే! వాడికి అన్నం పెట్టి త్వరగా పంపు."

గౌరిగాడు గాటికిఆనుకు కూర్చున్నాడు. "సాహసం! సాహసం!" ఆ మాటలు జోరీగల్లా, కందిరీగల్లా అతడి చెవిచుట్టూ తిరగసాగినై. నిర్ణయించుకున్నాడు...

శాంత అన్నం పెట్టింది.

"సినిమా చూసినప్పటి నుంచీ మతి చెడిందా ?" ఫక్కున నవ్వింది.

అతడి మదిలో ఏదో తెలియని బాధా, కళ్ళు తెరుస్తూన్న కలవరం, గురివింద తీగల్లా అన్ని వైపులనుంచీగుబురుకున్నయ్.

శాంతకు జవాబు చెప్పేందుకు అలాంటి ఘట్టంలో సినీమా కథానాయకుడు ఏమన్నాడో ఆ మాటలు గుర్తు చేసుకునేందుకు ప్రయత్నించాడు. కానీ ఏగుర్తూ అతడి మనస్సు గొంతుకు అందించలేకపోయింది.

సాధారణంగా — అతి సాధారణంగా, ఎడమకన్ను కొట్టి, కుడి కాలుతో మల్లను పక్కకుతోసి, రెండు చేతుల్నీ ముందుకు చాపి లేచినుంచుని, శాంత వైపుకు నడిచేందుకు వుపక్రమించాడు.

"తొందరగా రావే! పాలు పొంగిన వాసన వస్తోంది."

శాంత యింట్లోకి పరిగెత్తింది. పరిగెత్తే ముందు ఆ అమ్మాయిలో ఏవుద్రేకాలూ, వుద్వేగాలూ కలిగినయ్యో కాని — బిగువుగానే వున్న ఛోళీ పిగలలేదు. పమిట జారలేదు.

* * * *

ఆ రాత్రి సగం తయారైన కడిం మీద వెల్లకిలా పడుకుని అష్టమి నాటి చంద్రుణ్ని చూస్తూ గౌరిగాడు పాడేందుకు గొంతు సవరించబోయాడు.

"అరే గౌరిగా?" పెద్ద కేక.

"ఏమిటి దొరా!" బెదురుగా, చెదిరిన మనస్సులోనుంచి జవాబు.

"నువ్వు మధ్యాహ్నం చేసిన పని..."

ఠక్కున సినీమా మాటలు గౌరిగాడి గొంతు చించుకుని బయట పడినై...

"నిజమేచెప్ప......"

అతడిమాట పూర్తి కాకుండానే; నల్లగా చావ తేలిన నున్నటి సంద్రకర్ర కత్తవ అతడి మెడమీద పడింది. గింజరాలి కలగా పులకంగా నలిగిన ఆ ఎండు వరిగడ్డిలో కొద్దిపాటి గలగల గిలగిల!

భగ్గున అంటుకుని ఆకాశం వైపుకు నాలుకలు చాచిన ఆ ఎర్రని మంటలకు ఎండు వరిదుబ్బుల్లో పచ్చగా పెరిగిన నాము పిలకలు మాడిపోయినై; చేలగట్లూ, నెర్రెల్లో దాక్కున్న బుర్రపిట్టలూ, కలుగుల్లోని తాచుపాములూ భయంతో కంపించి, కుంచుకుపోయినై.

